సాక్షి రంగారెడ్డి
ఆదివారం । 13 । జూలై । 2025



అంతా కల'రింగ్'
ఫ్లై ఓవర్లకు రంగులేశారు. ఇంతవరకు బాగానే ఉంది కానీ.. వాటి పటిష్టత ఎంత? అన్నది మాత్రం చెప్పలేని పరిస్థితి. 8లో▸



మంజూరు పత్రాల పంపిణీ
గ్రామీణ స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ, పౌల్ట్రీ రంగాల వారికి రుణాల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. 8లో▸



తల్లీపిల్లల ఆచూకీ లభ్యం
తప్పిపోయిన తల్లీపిల్లల ఆచూకీ లభ్యమైన సంఘటన కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

ఆర్‌యూపీపీటీఎస్ జిల్లా కమిటీ నియామకం



అనురాధ



రాఘవేంద్రచారి

షాద్‌నగర్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీటీఎస్) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా నందిగామ మండలం నర్సప్పగూడ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న అనురాధను, ప్రధాన కార్యదర్శిగా ఫరూఖ్‌నగర్ ఉర్దూమీడియం పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దార్ల రాఘవేంద్రాచారిని ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ తెలిపారు.

చిత్రకారులను కళాకారులుగా గుర్తించాలి

చిత్ర కళాకారుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ఆమనగల్లు: చిత్రకారులను కళాకారులుగా గుర్తించాలని చిత్ర కళాకారుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపం వెంకట్‌రెడ్డి కోరారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో చిత్రకారులకు చేతినిండా పని ఉండేదని.. ప్రస్తుతం పనిలేక జీవనోపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో చిత్రకారులు చురుకుగా పాల్గొన్నారని, కేసులకు భయపడకుండా ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న బోర్డులను చెరిపి తెలంగాణ పదం చేర్చారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రకారుల బాధలను గుర్తించి న్యాయం చేయాలని కోరా రు. ఈ సమావేశంలో చిత్రకారులు కొండల్, లింగంగౌడ్, గోపి, యాదయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ



వృక్ష ప్రతిష్ఠ చేస్తున్న వెంకటేశ్వరశర్మ తదితరులు

కడ్తాల్: మానవాళి మనుగడకు వృక్షాలు ఎంతగానో తోడ్పతాయని, ఔషధాలతో పాటు, ప్రాణవాయువును అందిస్తాయని అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు పరమాత్మ గిరిస్వామి, వేదపండితులు మేళ్లూరి వెంకటేశ్వరశర్మ అన్నారు. శనివారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సహకారంతో మండల కేంద్రంలోని హనుమన్‌ఘడ్ ఆంజనేయ స్వామి ఆలయంలో మొక్కలకు ప్రత్యేక పూజలు చేశారు. పరిసరాలలో వృక్ష ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవనానికి చెట్లు ఎంతగానో ఉపయోగపడతాయని, అవసరమైన ఫలాలు అందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, సీజీఆర్ చైర్‌పర్సన్ లీల, సీజీఆర్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి, సీఐ గంగాధర్, ఎస్ఐ చంద్రశేఖర్, నాయకులు జంగారెడ్డి, గంప రాములు, గంజి అంజయ్య, మల్లారెడ్డి, భిక్షపతి, మల్లయ్య, వెంకటేశ్, రఘుపతిరెడ్డి, జంగయ్య, వెంకటేశ్వర శర్మ, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


చెంచుల సంక్షేమానికి కృషి

అనంతగిరి: చెంచుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అనంతగిరిపల్లి చెంచు కాలనీలో ప్రధానమంత్రి జన్మాన్ పథకం కింద నిర్మించనున్న మల్టీ పర్పస్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెంచు కాలనీల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రూ.60 లక్షల వ్యయంతో మల్టీ పర్పస్ సెంటర్ భవనాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కమలాకర్ రెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు మైపాల్ రెడ్డి, షరీఫ్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, సీనియర్ నాయకులు ఎండీ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మాకొద్దు

పెరిగిన సిమెంట్, స్టీలు ధరలు.. మేస్త్రీ, ఇతర కూలీల చార్జీలు.. 400 చదరపు అడుగుల విస్తీర్ణంలోనే ఇళ్లు నిర్మించుకోవాలనే నిబంధనలు.. క్షేత్రస్థాయిలోని ఖర్చులు, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీకి పొంతన లేకపోవడం.. ఖర్చుల కోసం చేతిలో చిల్లిగవ్వ లేకపోవడం... వెరసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవరోధంగా మారాయి. మెజార్టీ లబ్ధిదారులు వెనుకాడుతున్నారు.





షాబాద్‌లో నిర్మాణంలో ఉన్న ఇల్లు, (ఇన్‌సెట్) ఇల్లు రద్దు చేయాలని ఓ లబ్ధిదారు విన్నపం

నిర్మాణానికి జంకుతున్న లబ్ధిదారులు

- సామగ్రి ధరలతో బెంబేలు
- అంచనాలకు మించి ఖర్చులు
- ముగ్గు పోసేందుకు వెనుకడుగు
- ప్రొసీడింగ్స్ రద్దు చేసుకుంటున్న వైనం

జిల్లాకు మంజూరైన ఇళ్లు:	2,800
నిర్మాణానికి నిరాకరిస్తున్నవారు:	1,304
ఎటూ తేల్చుకోలేనివారు:	403

సాక్షి, రంగారెడ్డి జిల్లా: అనువైన నివాస స్థలం ఉండి.. గూడులేని నిరుపేదలకు సొంతిల్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం జిల్లాకు 28 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. ఈ పథకం కింద లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ.5 లక్షల చొప్పున చెల్లించనున్నట్లు ప్రకటించింది. ముందస్తు ఖర్చులకు లబ్ధిదారుల వద్ద డబ్బులు లేకపోవడంతో ముగ్గు పోసేందుకే జంకుతున్నారు. ఆంక్షలు, ఆర్థిక ఇబ్బందుల మధ్య ఇళ్లు కట్టుకోలేకపోతున్నట్లు చెబుతున్నారు. తమకు కేటాయించిన ఇళ్లను రద్దు చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా లేఖలు అందిస్తుండడం విశేషం. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సాక్షి బృందం నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో అనేక అంశాలు వెలుగు చూశాయి.

మండలాల్లో ఇలా..

- శంకర్‌పల్లి మండలంలో 450 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 236 మంది నిర్మాణ పనులు చేపట్టారు. 186 మంది ఇతర కారణాలతో తమకు ఇళ్లు వద్దని అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. మరో 28 మంది ఎటూ తేల్చుకోలేక పోతున్నారు.
- ఇబ్రహీంపట్నం మండలంలో 436 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 268 మంది నిర్మాణం మొదలు పెట్టారు. 36 ఇళ్లు బేస్మెంట్ వరకు పూర్తయ్యాయి. మరో 57 నిర్మాణానికి నిరాకరించారు.
- కందుకూరు మండలంలో 1,222 మందికి ఇళ్లు మంజూరు కాగా, 540 మంది నిర్మాణ పనులు చేపట్టగా, 129 ఇళ్లు మాత్రమే బేస్మెంట్ వరకు పూర్తయ్యాయి.
- షాబాద్ మండలంలో 700 మందికి ఇళ్లు మంజూరు కాగా, 439 మంది నిర్మాణలు ప్రారంభించారు. 113 ఇళ్లు బేస్మెంట్ లెవల్‌కు చేరుకున్నాయి. 113 మంది నిరాకరించారు.
- మహేశ్వరం మండలంలో 1,054 ఇళ్లు మంజూరు కాగా, 598 మంది నిర్మాణ పనులు మొదలు పెట్టగా, 295 మంది నిరాకరించారు. 124 ఇళ్లు బేస్మెంట్ లెవల్‌కు చేరుకోగా, 25 ఇళ్లకు మాత్రమే రూ.లక్ష చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో జమైంది.
- కడ్తాల్ మండలంలో 349 ఇళ్లు మంజూరు కాగా, 271 మంది మాత్రమే పనులు మొదలు పెట్టారు. మరో 78 మంది ఇప్పటి వరకు ఏ నిర్ణయం తీసుకోలేదు.
- మొయినాబాద్ మండలంలో 500 ఇళ్లు మంజూరు కాగా, 276 ఇళ్లకు పనులు ప్రారంభమయ్యాయి. 224 మంది నిరాకరించారు.
- మంచాల మండలంలో 437 మందికి ఇళ్లు మంజూరు కాగా, వీరిలో ఇప్పటి వరకు 350 మాత్రమే వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన వారు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.
- యాచారం మండలంలో 440 ఇళ్లు మంజూరు కాగా, 316 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. 50 మంది ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. మరో 74 మంది నిరాకరించారు.
- కేశంపేట మండలంలో 745 మందికి ఇళ్లు మంజూరు కాగా, వీరిలో 525 మంది మాత్రమే నిర్మాణానికి ముగ్గు పోశారు. మిగిలిన వారు సందేహిస్తున్నారు. 133 ఇళ్లు బేస్మెట్ లేవల్‌కు చేరుకోగా, 98 మందికి మాత్రమే మొదటి విడతలో భాగంగా రూ.లక్ష చొప్పున వారి ఖాతాల్లో జమ చేశారు.
- కొత్తూరు మండలంలో 170 ఇళ్లు మంజూరు కాగా, 112 మంది మాత్రమే పనులు ప్రారంభించారు. మిగిలిన వారు ఏ నిర్ణయం తీసుకోలేదు.
- నందిగామ మండలంలో 402 ఇళ్లు మంజూరు కాగా, 270 మంది మాత్రమే నిర్మాణ పనులు ప్రారంభించారు. మిగిలిన వారు ఎటూ తేల్చుకోలేపోతున్నారు.

మున్సిపాలిటీల్లో అలా..

- శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో 200 ఇళ్లు మంజూరు కాగా, 93 మంది మాత్రమే పనులు మొదలు పెట్టారు. 104 మంది తమకు ఇళ్లు వద్దని అధికారులకు స్పష్టం చేశారు. ముగ్గురు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.
- ఆదిబట్ల మున్సిపల్ పరిధిలో 437 ఇళ్లు మంజూరు కాగా, 244 మంది మాత్రమే నిర్మాణ పనులు ప్రారంభించారు. 140 మంది ఆసక్తి చూపడం లేదు.
- తుర్కయాంజాల్ మున్సిపల్ పరిధిలో 437 ఇళ్లు మంజూరు కాగా, 310 ఇళ్లకు మాత్రమేగ్రౌండింగ్ మొదలైంది. మరో 80 మంది నిర్మాణానికి నిరాకరించారు.
- మొయినాబాద్ మున్సిపాలిటీలో 200 ఇళ్లు మంజూరు కాగా, 101 మంది పనులు మొదలు పెట్టారు. 99 మంది నిర్మాణానికి నిరాకరించారు.
- తుక్కుగూడ పరిధిలో 275 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కాగా, 194 ఇళ్లకు మాత్రమే గ్రౌండింగ్ అయింది.
- బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో 335 ఇళ్లు మంజూరు కాగా, 216 ఇళ్లకు ముగ్గు పోశారు. 75 ఇళ్లు బేస్మెంట్ లెవల్‌కు చేరుకున్నాయి.

బస్తీమే సవాల్.. తెల్లారితే పరార్

- ఇదీ ముఖ్యమంత్రి తీరు
- జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- అభయహస్తం మేనిఫెస్టో అమలుకు పోస్టుకార్డు ఉద్యమం
- సోనియాగాంధీకి లేఖలు



కార్డును పోస్టు చేస్తున్న కవిత

కేశంపేట: 'హైడ్రా పేరుతో పేదల గుడిసెలు కూల్చేందుకు బుల్డోజర్లు వెళ్తున్నాయని, పెద్దల ఇళ్ల జోలికి ఎందుకు వెళ్లడం లేదని ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే.. బస్తీమే సవాల్ అంటాడు, తెల్లారితే పరార్ అవుతాడు' అని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మండలంలోని వేములనర్వలో శనివారం జాగృతి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కాకునూరు గ్రామంలో స్థానిక మహిళలతో కలిసి పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలందరికీ రూ.2,500 చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఒక్కో మహిళకు 18 నెలలకు సంబంధించిన రూ.45 వేలు చెల్లించాలని కోరుతూ ఢిల్లీలోని సోనియాగాంధీ అడ్రస్‌కు పోస్టు కార్డులు పంపించారు. రైతుబంధు సాయాన్ని పెంచుతామని, రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్ రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. రూ.2 లక్షల కోట్ల అప్పులు తెచ్చినప్పటికీ అభివృద్ధి చేయడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఫ్రీ బస్సు ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం బస్సుల సంఖ్య పెంచకుండా ఇబ్బంది పెడుతోందన్నారు. కరువుతో విలవిల్లాడిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. ఆయన హయాంలో పాలమూరు ప్రాజెక్టు నిర్మాణం తొంభై శాతం పూర్తయిందని, కేవలం పది శాతం పనులను చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదని మండిపడ్డారు. అమ్మ ఒడి వాహనాల్లో డీజిల్ లేక తోయాల్సిన పరిస్థితి హన్వాడలో చూశామన్నారు. తమ పాటలతో ఆకట్టుకున్న కాకునూరుకు చెందిన అక్కమ్మ, రాములమ్మ జానపద బృందాన్ని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గంగ్ర జగదీశ్వర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ అనురాధ పర్వాత్ రెడ్డి, కాకునూర్ మాజీ సర్పంచ్ గంగ్ర లక్ష్మమ్మ, మాజీ ఎంపీటీసీ రమాదేవి కోటీశ్వర్, జంగారెడ్డి, రాములు, కుమారస్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కవిత

సేవ వైపు మళ్లించాలి

తాండూరు టౌన్: యువతను సామాజిక సేవా తత్పరత వైపు మళ్లించేందుకు శ్రీ రామకృష్ణ సేవా సమితి కృషి చేయాలని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు శ్రీ పూజ స్వామి బోధమయానంద మహారాజ్ అన్నారు. శనివారం తాండూరులోని తులసీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో రామకృష్ణ, వివేకానంద భావ ప్రచార పరిషత్ రాష్ట్ర అర్ధ వార్షిక సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 18 సేవా సమితులు, 71 మంది ప్రతినిధుల భక్త బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు బానిసలుగా కాకుండా వారిని సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక జీనవం వైపు మళ్లించాలన్నారు.



ఆర్‌సీఐ పరిసరాల్లోని అటవీ ప్రాంతం

చిరుతల కోసం అన్వేషణ

ఆనవాళ్లు లభించలేదన్న అధికారులు

పహాడీషరీఫ్: బాలాపూర్‌లోని ఆర్‌సీఐ (రీసెర్చ్ సెంటర్ ఇమారత్)లో చిరుత పులులు సంచరించాయన్న వదంతుల నేపథ్యంలో అటవీశాఖ అధికారులు శనివారం వాటి జాడ కోసం గాలించారు. ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదు. ఆర్సీఐలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి మూడు రోజుల క్రితం చిరుత కనిపించిందంటూ అధికారులకు వెల్లడించడం, మరుసటి రోజు ఓ శునకం ఇదే ఆవరణలో మృతి చెందడంతో చిరుతలు తిరుగుతుండొచ్చని భావించారు. ముందు జాగ్రత్తలో భాగంగా ఈ ఆవరణలోనే ఉన్న డిఫెన్స్ ల్యాబోరేటరీస్ స్కూల్ ప్రిన్సిపాల్.. విద్యార్థుల తల్లిదండ్రులకు ఇదే విషయాన్ని నోటీస్ రూపంలో పంపి, పాఠశాల నుంచి బయటకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. ఇది కాస్తా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో అటు అటవీ శాఖ, ఇటు బాలాపూర్ పోలీసులు రంగంలోకి దిగారు. ఆర్సీఐ పరిసరాల్లో చిరుతల పాదముద్రల కోసం అన్వేషించారు. అలాంటి ఆనవాళ్లు ఏవీ లభించలేదని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ తెలిపారు. వేరే ఏదైనా జంతువును చూసి చిరుతగా భావించి ఉండొచ్చని అటవీశాఖ అధికారులు తెలిపినట్లు తెలిసింది.

బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న చల్లా నర్సింహా రెడ్డి

మహేశ్వరం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని అన్నారు. పట్టా పాసు బుక్ కలిగిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.6 వేల చొప్పున పంట పెట్టుబడి సాయం, రూ. 2లక్షలలోపు రైతు రుణమాఫీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళలకు రూ.500 గ్యాస్ సబ్సిడీ, పేదలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలు ఒక్కరికైనా డబుల్ బెడ్రూం నిర్మాణం చేసి ఇచ్చారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ఇందిరాగాంధీ పేదలకు అసైన్డ్ భూముల పంపిణీ, ఇళ్ల స్థలాల పంపిణీ చేశారని, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్‌ను ఆదర్శంగా తీసుకొని సీఎం రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ బీసీలను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

గోశాలకు సాగు భూములెందుకు?

- బీడు భూములు ఇవ్వండి
- ఎనికేపల్లి రైతులకు న్యాయం చేయండి
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి



సాగుచేసిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి

మొయినాబాద్: గోశాల ఏర్పాటుకు రైతులు సాగు చేసుకుంటున్న భూములెందుకు ఇస్తున్నారు.. బీడులుగా మారిన ప్రభుత్వ భూములు చాలా ఉన్నాయి.. వాటిని ఇవ్వండని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి రైతులు చేపడుతున్న రిలే నిరహార దీక్షలో శనివారం ఆయన పాల్గొన్నారు. పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎనికేపల్లి 180 సర్వే నంబర్‌లోని 99.14 ఎకరాల భూముల్లో 30 ఎకరాలను 1954లోనే ప్రభుత్వం రైతులకు అసైన్డ్ చేసిందని అన్నారు. మిగతా భూమిని సైతం విడతలవారీగా అసైన్డ్ చేయగా కొంత ప్రభుత్వ భూమిగా ఉందన్నారు. మొత్తం భూమిని రైతులు సుమారు 80 ఏళ్లుగా సాగుచేసుకుంటున్నారని.. వర్షాధార పంటలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అలాంటి పేద రైతుల భూములను గోశాలకోసం లాక్కోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఎకరాకు 300 గజాల ఇంటి స్థలం పరిహారంగా ఇస్తామని చెబుతోందని.. 80 ఏళ్ల క్రితం 50 కుటుంబాలుగా ఉన్న రైతులు నాలుగు తరాలు గడవడంతో ఇప్పుడు 500 కుటుంబాలకు పెరిగాయన్నారు. ప్రభుత్వం దీన్ని దృష్టిలో పెట్టుకుని పరిహారం ఇవ్వాలని సూచించారు. ఈ విషయమై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, పార్టీ మండల మాజీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, పద్మనాభం, మాజీ సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం

- కల్తీ కల్లు విక్రయాలను నిరోధించాలి
- ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- వికారాబాద్‌లో శాఖ కార్యాలయం ప్రారంభం



ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి జూపల్లి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

వికారాబాద్: డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం మోపాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. జిల్లా కేంద్రం వికారాబాద్‌లో శనివారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నూతన కార్యాలయ భవనాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయితో పాటు ఇతర మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ఇవి ఎక్కడి నుంచి సరఫరా అవుతున్నాయో నిఘా పెట్టాలని సూచించారు. ఇందుకోసం అవసరమైతే ఇతర రాష్ట్రాల సహకారం తీసుకోవాలన్నారు.

ఈత, తాటి, కర్జూర చెట్లు పెంచాలి

రాష్ట్ర వ్యాప్తంగా చెరువు కట్టల మీద, గుట్టలపైన, కాల్వల పక్కన ఈత, తాటి, కర్జూర వంటి మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామంలో ఐదు ఎకరాల మేర స్థలంలో వీటిని నాటేలా చూడాలన్నారు. నగరానికి సమీపంలో ఉన్న వికారాబాద్ నుంచి హైదరాబాద్‌కు నీరా, కల్లు ఎగుమతి చేసే విషయంపై దృష్టి సారించాలని తెలిపారు. కల్లు దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ కల్తీ కల్లు విక్రయాన్ని అడ్డుకోవాలని ఆదేశించారు. ఇందుకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. అన్నివర్గాల ప్రజల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కల్తీ కల్లు, మాదకద్రవ్యాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మహేందర్‌రెడ్డి, పల్లెలను పాడు చేస్తున్న డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపాలని ఎంపీ కొండా అన్నారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ్, సూపరింటెండెంట్ విజయభాస్కర్, అదనపు కలెక్టర్ సుధీర్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎక్సైజ్ శాఖ సర్కిల్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మహిళకు తీవ్ర గాయాలు

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరొక మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గూడూరు అనుబంధ గ్రామం బండమీద గూడూరుకు చెందిన గోల్కొండ జంగయ్య(57) శనివారం ఉదయం టీవీఎస్ లూనాపై జైత్వారం గ్రామానికి వెళ్లాడు. తిరిగి వచ్చే సమయంలో తన మరదలు లక్ష్మమ్మను ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో కొత్తగూడ సమీపంలో మద్ది లక్ష్మారెడ్డి ఫౌల్ట్రీఫాం వద్ద ఎదురుగా అతివేగంగా వస్తున్న బోర్వెల్ వాహనం లూనాను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన జంగయ్య అక్కడికక్కడే మృతి చెందగా, లక్ష్మమ్మ తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పరమేష్ తెలిపారు.

హెచ్‌ఎం దురుసు ప్రవర్తనపై ఫిర్యాదు చేస్తాం

షాబాద్: విద్యార్థుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న షాబాద్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోవింద్‌నాయక్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకుడు రాకేశ్ డిమాండ్ చేశారు. సదరు హెచ్‌ఎం శుక్రవారం ఆరో తరగతి విద్యార్థి రాకేశ్‌ను కొట్టాడని తెలుసుకున్న ఆయన స్కూల్‌కు వెళ్లి అడగగా.. నన్ను అడిగేందుకు నువ్వెవరు..? నా స్కూల్ నాఇష్టం అంటూ బెదిరింపు ధోరణితో మాట్లాడారన్నారు. ఆయన వ్యవహారంపై కలెక్టర్, డీఈఓకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

అంతా కల'రింగ్'

పైపై పూతలతో రంగులు

- పటిష్టత లేని హంగులు
- ఫ్లై ఓవర్లకు ఇవేం పనులు?
- వృథా అవుతున్న రూ.కోట్లు
- ఇవి ఎవరి ప్రయోజనాల కోసమో..
- కాంట్రాక్టర్ల జేబులు నింపడానికో..



నారాయణగూడ ఫ్లై ఓవర్‌కు రంగులు సరే.. పటిష్టత మాటేంటి?

సాక్షి, సిటీబ్యూరో: తెలుగుతల్లి.. నారాయణగూడ తదితర ప్రాంతాల్లోని ఫ్లై ఓవర్లకు రంగులేశారు. ఇంతవరకు బాగానే ఉంది కానీ.. వాటి పటిష్టత ఎంత? అన్నది మాత్రం చెప్పలేని పరిస్థితి. ప్రపంచ సుందరి పోటీలు అనో, ఇంకో సందర్భమనో, ఏవీ కాకున్నా నగరం అందంగా కనపడాలనో పలు ప్రాంతాల్లోని ఫ్లై ఓవర్లకు రంగులేశారు. రూ.కోట్లు ఖర్చు చేశారు. ఆ చేసే పనేదో వాటికి పటిష్టత పరీక్షలు నిర్వహించి, అవసరమైన మరమ్మతులు చేశాక రంగులేస్తే ప్రయోజనం ఉండేది. కానీ.. ఎవరి ప్రయోజనాలకో, కాంట్రాక్టర్లకు జేబులు నింపడానికో ఇలాంటి పనులు చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇంటికైనా మరో నిర్మాణానికైనా రంగులేశాక మరమ్మతులు చేస్తారా? మరమ్మతులు చేశాక రంగులేస్తారా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఫ్లై ఓవర్లకు పెద్దగా మరమ్మతులంటూ అవసరం ఉండదు.. కానీ నిర్ణీత వ్యవధుల్లో నిర్మాణ పటిష్టత (స్ట్రక్చరల్ స్టెబిలిటీ) పరీక్షలు అవసరమంటున్నారు నిపుణులు. నగరంలోని కొత్త ఫ్లై ఓవర్లు మినహాయిస్తే పాత ఫ్లై ఓవర్లకు అవి తప్పనిసరి అని పేర్కొన్నారు. నగరంలో దశాబ్దం, రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఫ్లై ఓవర్లు 30కి పైగా ఉన్నాయి. బేగంపేట, సీటీఓ జంక్షన్, హరిహర కళాభవన్, తార్నాక, బషీర్‌బాగ్, మాసబ్‌ట్యాంక్, తెలుగుతల్లి తదితర ప్రాంతాల్లోని ఫ్లై ఓవర్లు నిర్మించి రెండు దశాబ్దాలు దాటింది. వీటన్నింటికీ స్టెబిలిటీ పరీక్షలు నిర్వహించి అవసరమైన మరమ్మతులు చేయాల్సి ఉంది. ఆ పని చేయకుండా ఫ్లైఓవర్లపై పడే గుంతలు పూడ్చేందుకు పైపై కోటింగ్‌లు వేస్తూ పోతుండటంతో కొన్ని ఫ్లై ఓవర్ల మందం పెరిగిపోయింది.

పటిష్ట చర్యలు అవసరం

దీర్ఘకాలంలో ఫ్లై ఓవర్లకు సంబంధించిన బేరింగులు, ఎక్స్‌పాన్షన్ జాయింట్స్ వదులవుతాయని వాటిని పటిష్ట పరిచేందుకు మరమ్మతులు అవసరమని ఇంజినీరింగ్ నిపుణులు తెలిపారు. నగరంలోని పాత ఫ్లై ఓవర్లలో రెండు మూడు ఫ్లై ఓవర్లకు తప్ప మిగతా వాటికి మరమ్మతులు జరగలేదని సమాచారం. ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌కు దాదాపు ఐదేళ్ల క్రితం స్వల్ప మరమ్మతులు మాత్రం చేశారు. పూర్తిస్థాయి మరమ్మతులు చేయకుండానే ప్రస్తుతం రంగుల హంగులు, పచ్చదనం పెంపు వంటి చర్యలకు సిద్ధమయ్యారు.

నిర్ణీత వ్యవధుల్లో మరమ్మతులు అవసరం..

నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం, సాధారణంగా ఫ్లైఓవర్లలోని గర్డర్స్ ప్రాంతాల్లో కాంక్రీట్ దెబ్బతింటుంది. బేరింగులు అరిగిపోతాయి. ఎక్స్‌పాన్షన్ జాయింట్స్ వదులై బలహీనంగా మారతాయి. స్తంభాల పైభాగాలు (పయర్ క్యాప్స్) తుప్పుపడతాయి. బాక్స్‌గర్డర్స్ ఏటవాలు గోడల్లో పగుళ్లు ఏర్పడతాయి. నిర్ణీత వ్యవధుల్లో వాటికి మరమ్మతులు చేయాల్సి ఉన్నప్పటికీ అలా జరగడం లేదు. ఒక్కో ఫ్లైఓవర్‌కు దాదాపు 15-20 స్పాన్‌లుంటాయి. వాటిల్లో ఉండే బేరింగ్‌లను జాకీలు ఏర్పాటుచేసి మార్చాల్సి ఉంటుంది. బయో డైవర్సిటీ ఫ్లై ఓవర్ కొత్తలోనే జరిగిన ప్రమాదంతో కొత్తవి, పాతవి అన్నింటికీ అదనపు సేఫ్టీ ఏర్పాట్లు చేయాలని, వేగ పరిమితి హెచ్చరికలతో పాటు క్రాష్‌బారియర్స్, వ్యూకట్టర్స్ తదితర ఏర్పాట్లు చేయాలని భావించారు. కానీ ఇప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. అధికారుల వద్ద ఈ అంశాలు ప్రస్తావించగా, త్వరలో తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

థర్డ్ పార్టీతో పరీక్షలు

నగరంలోని పాత ఫ్లై ఓవర్ల పటిష్టతను నిర్ధారించేందుకు థర్డ్‌పార్టీ నిపుణుల కమిటీని నియమించి, పరీక్షలు చేయించి అదిచ్చేనివేదిక మేరకు, కమిషనర్ సూచనలకు అనుగుణంగా స్పెషలైజ్డ్ మెయింటనెన్స్ ఆపరేషన్స్, రిట్రో ఫిట్టింగ్, రిస్టోరేషన్ పనులు జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. పాట్‌హోల్స్ పూడ్చివేత, స్వల్ప పగుళ్ల ప్యాచ్ వర్క్స్, దెబ్బతిన్న రెయిలింగ్స్‌కు మరమ్మతుల తోపాటు అవసరమైన ప్రాంతాల్లో యాంటి కార్బొనేషన్ పూతలు వేసే పనులు నిర్వహణ విభాగం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

వ్యక్తి బలవన్మరణం

పహాడీషరీఫ్: తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన అంబికా, సుధాకర్(45) దంపతులు 17 ఏళ్ల క్రితం జల్‌పల్లి శ్రీరామ కాలనీకి బతుకుదెరువు నిమిత్తం వలస వచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటూ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం. తాగుడుకు బానిసైన సుధాకర్ మూడు నెలలుగా భార్యను వేధిస్తుండడంతో ఆమె పిల్లలతో కలిసి స్థానికంగా ఉండే తన తల్లిగారింటికి వెళ్లింది. ఐదు రోజులుగా పనికి రాకపోవడంతో శనివారం ఉదయం తెలుసుకుందామని తోటి కార్మికుడు దేవిదాస్ చూసేందుకు వెళ్లడంతో సుధాకర్ ఇంట్లోని కిటికీ గ్రిల్స్‌కు ఉరేసుకొని కనిపించాడు. వెంటనే అతడు సుధాకర్ భార్యకు సమాచారం ఇవ్వడంతో ఆమె వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. సుధాకర్ శుక్రవారం రాత్రి కూడా బాగా తాగి కనిపించాడని, తాగుడుకు బానిసై మానసికంగా స్థితి సరిగ్గా లేక ఆత్మహత్య చేసుకున్నాడని ఆమె పోలీసు ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

రాజేంద్రనగర్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం.. హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన సునీల్ (19) పదో తరగతి వరకు చదివి ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నాడు. శనివారం ఉదయం తల్లి చదువుకోవాలని మందలించింది. దీంతో మనస్థాపం చెందిన సునీల్ ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. అనుమానంతో కుటుంబ సభ్యులు డోర్ తెరిచి చూడగా ఉరేసుకుని కనిపించాడు. వెంటనే స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసిన రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

- పశువుల మందపై దాడి
- ఆవు మృత్యువాత



కుక్కకాటుతో మృత్యువాత పడిన ఆవు కళేబరం

ధారూరు: పశువుల మందపై పిచ్చికుక్క దాడి చేయడంతో ఓ ఆవు మృత్యువాత పడింది. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని నాగసమందర్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. మాజీ వైస్ ఎంపీపీ వరద మల్లికార్జున్‌కు చెందిన పశువులపాకలోకి ఓ పిచ్చి కుక్క వెళ్లి ఆవును కరవడంతో అది అక్కడికక్కడే మృత్యువాత పడింది. గ్రామంలో ఎక్కడ పశువులు కనిపించినా కుక్క వెంబడించింది. గమనించిన గ్రామస్తులు పట్టుకునేందుకు యత్నించినా దొరకలేదు.

నాగారంలో చిన్నారిపై దాడి

మండల పరిధిలోని నాగారంలో చాకలి కృష్ణయ్య కూతురుపై శుక్రవారం రాత్రి ఓ కుక్కదాడి చేసి గాయపరిచింది. దీంతో చిన్నారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో వీధి శునకాలను తరలించేందుకు అధికారులు చొర తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తప్పిపోయిన తల్లీపిల్లల ఆచూకీ లభ్యం



మహబూబ్‌నగర్ టూటౌన్‌లో దీపిక పిల్లలు

కేశంపేట: కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఈ విషయమై భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేశంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న అదృశ్యమైన దీపికతో పాటు సంయ్‌కుమార్, కీర్తన శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉన్న టూటౌన్ ఠాణాకు వెళ్లారు. అక్కడ పోలీసులు దీపిక భర్త శివలింగంకు కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించారు.

పసికందును పారేశారు!



శిశువును ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

ఉప్పల్: ఆ కన్నతల్లికి పేగు బంధమే భారం అయిందా? శిశువును వదిలించుకోవాలని ఎవరైనా ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారా? అనే రీతిలో అమానవీయ ఘటన జరిగింది. అప్పుడే పుట్టిన.. ఇంకా కళ్లు కూడా సరిగా తెరవని పసికందును రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామంతాపూర్ వివేక్‌నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున మగశిశువు ఏడుస్తున్న శబ్దం వినిపించడంతో కౌశిక్ అనే వ్యక్తి ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్‌లో శిశువును నగరంలోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. చిన్నారి కంటికి గాయం కావడంతో కమిలిపోయి ఉంది. ఆస్పత్రిలో చిన్నారిని వైద్యులు పరీక్షించారు. శిశువుకు ఎలాంటి అపాయం లేదని వారు వెల్లడించినట్లు సమాచారం. కన్నతల్లే కావాలని శిశువును ఇలా రోడ్డుపై వదిలి వెళ్లిందా? లేక ఎవరైనా వేరే ప్రాంతం నుంచి తీసుకువచ్చి ఇక్కడ పారవేశారా? అనే విషయం తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

డెలివరీ బాయ్‌పై దాడి కేసులో ఇద్దరి రిమాండ్



దాడికి పాల్పడిన నిందితులు

అత్తాపూర్: డెలివరీ బాయ్‌పై దాడి కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర రావు తెలిపిన వివరాల ప్రకారం.. సులేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ రేహాన్ (20) పీవీ ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నంబర్ 208 సమీపంలో జీప్టో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన సులేమాన్ (25), యూనస్ (25)ను తోడుగా తీసుకువచ్చాడు. ఫుడ్ డెలివరీ చేసేందుకు ఆర్డర్లు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో మరో వ్యక్తిని ఎందుకు తీసుకువచ్చావు అని రేహాన్ సులేను ప్రశ్నించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మరో ఇద్దరు స్నేహితులు ఇమ్రాన్ (25) సలీం (22) పిలిచాడు. నలుగురు కలిసి రేహాన్‌పై దాడి చేయడంతో పాటు పదునైన కత్తితో ఎడమ చేయి, ఎడమ కాలుపై గాయాలు చేసి పారిపోయారు. రేహాన్‌ను చికిత్స కోసం ఉస్మానియాకు తరలించారు. రేహాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

87 కిలోల కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్ సీజ్

ఆటో డ్రైవర్‌పై కేసు

తాండూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న కల్తీ అల్లంవెల్లుల్లి పేస్టు డబ్బాలను కరన్‌కోట్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన శనివారం మండల పరిధిలోని గౌతపూర్ చెక్‌పోస్ట్ వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన సజ్జతుల్లా ఖాన్ తన ఆటోలో 87 కిలోల అల్లంవెల్లుల్లి పేస్ట్ డబ్బాలు తీసుకెళ్తున్నాడు. చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అల్లంవెల్లుల్లి పేస్ట్‌కు సంబంధించి డ్రైవర్ ఎలాంటి పత్రాలు చూపించలేదు. దీంతో కల్తీగా భావించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసి ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. అల్లంవెల్లుల్లి శాంపిల్స్ ల్యాబ్ పంపిస్తామన్నారు.

రూ.50 కోట్ల రుణ మంజూరు పత్రాల పంపిణీ



రుణ మంజూరు పత్రాల పంపిణీలో బ్యాంక్ అధికారులు, లబ్ధిదారులు

శంషాబాద్ రూరల్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ముచ్చింతల్ శివారులో గల స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆవరణలో గ్రామీణ స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ, పౌల్ట్రీ రంగాల వారికి రూ.50 కోట్ల రుణాల మంజూరు పత్రాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లు, మిల్లెట్ ఆహార పదార్థాలు ఆకట్టుకున్నాయి. అలాగే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితేశ్ రంజన్, సీజీఎం-వన్ సుధాకర్‌రావు, హైదరాబాద్ జోన్ డిప్యూటీ జోనల్ హెడ్ సర్వేష్ రంజన్, సైఫాబాద్ రీజినల్ హెడ్ సోనాలికా తదితరులు పాల్గొన్నారు.